ప్రజాశక్తి

ఆదివారం 28 జులై 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





పార్టీలకతీతంగా సుపరిపాలన

ఉమ్మడి కృష్ణా జడ్‌పిలో మంత్రి కొల్లు రవీంద్ర



జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, ఇకపై పార్టీలకతీతంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మంచి పరిపాలన అందిద్దామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తొలుత మంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజా పాలనతో ముందుకు వెళదామన్నారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులకు అభినందనలు, జడ్పిటిసి, ఎంపిపి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాల్సిందన్నారు. బందరు పోర్టు పనులు వేగంగా పరిగెత్తించాలని, మచిలీపట్నంలో రూ.60 వేల కోట్ల నుండి రూ.70 వేల కోట్ల పెట్టుబడితో బిపిసిఎల్ వారు ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమ పాలన అందించాలని, అందుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలని అన్నారు.

సమావేశాన్ని ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామీణాభివద్ధిలో రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల స్వావలంబన కోసం కుట్టుమిషన్లు వంటి వాటిని అందించి వారి జీవనోపాధికి తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పార్లమెంటు, శాసన సభ్యులు సమన్వయంతో జిల్లాను అభివద్ధి పథంలో నడిపేందుకు కషి చేస్తామన్నారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన అవనిగడ్డ, పామర్రు, గన్నవరం, గుడివాడ, పెడన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కాగిత కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమ తమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు ప్రస్తావించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివద్ధి, రహదారులు తదితర అజెండా అంశాలపై సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కషి చేయాలని మంత్రి, జడ్పీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో తాగునీటి సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై పరిష్కార చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల్లో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ మంచినీటి కులాయి అందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని, నీటి నిల్వ కుంటల్లో, డ్రైన్లలో ఆయిల్ బాల్స్ స్ప్రే

(మిగతా 2లో)

తిరువూరు టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు



టిడ్కో గృహాలను త్వరగా పూర్తిచేయండి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

తిరువూరులో గృహాల పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : టిడ్కో గృహ సముదాయాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో సుదీర్ఘ కాలంపాటు తిరువూరులో పేదలు నిర్వహించిన పోరాటం ఫలితంగా 2009 కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం టిట్కో గహ సముదాయాల నిర్మాణం చేపట్టి 70 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వ టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్వీ.భద్రం, పంతంగి శ్రీనివాసరావులతో కలిసి డివి.కష్ణ శనివారం తిరువూరులో టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి.వి.కష్ణ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పేరుతో తీసుకున్న రుణం తాలూకా ఇఎంఐ చెల్లించాలని బ్యాంకుల నుండి నోటీసులు వస్తున్నాయన్నారు. కొంతమందికి బ్యాంక్ ఖాతాల్లో నుండి

(మిగతా 2లో)

జిల్లా ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాలు

ప్రారంభించిన మంత్రి కొల్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నూతనంగా కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన అధునాతన కంటి వైద్య పరికరాలను రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరికరాల పనితీరు, ఉపయోగాలను వైద్యాధికారి భానుమూర్తి మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మచిలీపట్నం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కంటి సమస్యలకు సంబంధించి వ్యాధుల నిర్ధారణ, చికిత్సల నిమిత్తం అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. తీర ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా నీటికాసులు ఏర్పడటం, రెటీనా దెబ్బ తినటం వంటి కంటి సమస్య లతో బాధపడుతుంటారని, అలాంటి వారికి ఈ వైద్య పరికరాలు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. అదేవిధంగా మెల్లకన్ను సమస్య ఉన్నవారికి శాస్త్ర చికిత్స కోసం పరికరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆసుపత్రికి అవసరమైన ఇతర వైద్య పరికరాలు, న్యూరాలజీ, కార్డియాలజీకి సంబంధించిన వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర వైద్యసేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవి రమేష్ కుమార్, కంటి విభాగం వైద్యులు డాక్టర్ భానుమూర్తి, స్థానిక నాయకులు బండి రామకష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్లు దేవరపల్లి అనితా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక కంటి వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర


ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల రోస్టర్లపై న్యాయం చేయాలి

వార్త 7లో

అపరాల పంటలకు తెగుళ్లు

ముసురు వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - కంచికచర్ల : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అపరాల పంటలకు తెగుళ్లు సోకాయి. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, వీరులపాడు, తిరువూరు, గంపలగూడెం, జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం, ఎ కొండూరు, వత్సవాయి మండలాల్లో తొలకరి పంటగా పెసర, మినుప, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో ఈనెల 17 నుండి 25వ తేదీ వరకు వారం రోజులపాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ముసురుపట్టి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ ముసురుకు పొలాల్లో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో తేమ ఆరక లేత మొక్క దశలో ఉన్న మెట్ట పంటలకు తెగుళ్లు సోకాయి. పెసర, మినుప పంటలో మొక్క ఆకులు పసుపు రంగు తెగులు సోకి ముడత పడ్డాయి, అలాగే నల్లి తెగులు, తెల్ల దోమ సోకింది. ప్రస్తుతం పొలాల్లో ఇంకా తేమ శాతం తగ్గలేదు. భూమి ఆరక కాలు వేస్తే దిగబడిపోతోంది. తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టడానికి పొలాలు ఆరలేదని, దీనికితోడు మబ్బులు పట్టి



జల్లులు కురుస్తున్నాయని రైతులు అంటున్నారు. మొక్క లేత దశలోనే వారం రోజులపాటు ముసురుకు తెగుళ్లు సోకి ఎదుగుదల లోపించిందని, దీని ప్రభావం పూత, పిందెపై పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, పిందె వచ్చినా రాలిపోతోందని రైతులు వాపోతున్నారు. మొక్క ఎదుగుతున్న దశలో ముసురుపట్టి తెగుళ్లు సోకటం వల్ల పంట చేతికివచ్చే పరిస్థితులు లేవని, దీనివల్ల పెట్టుబడులు కూడా రావని రైతులు లబోదిబోమంటున్నారు.



కంచికచర్ల మండలంలో పసుపు పచ్చ తెగులు, నల్లి తెగులు సోకిన పెసరు పంట



సైబర్ నేరాలు, నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటికి అడ్డుకట్ట వేయొచ్చని పలువురు పోలీసు అధికారులు అన్నారు. సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్లు పి.శ్రీనివాస్, డి.ప్రసాద్, నున్న ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పాయకాపురంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా నగదు మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, https://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

విఎంసి కమిషనర్‌ను కలిసిన జెసి

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను శనివారం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమిషనర్ ఛాంబర్లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జెసికి కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు.



విఎంసి కమిషనర్‌కు డిప్యూటీ మేయర్ శుభాకాంక్షలు

టిడిపి, వైసిపి ఫ్లోర్‌లీడర్లు, కార్పొరేటర్లు కూడా...



విఎంసి నూతన కమిషనర్ ధ్యానచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-విజయవాడ : నగర పాలక సంస్థ నూతన కమిషనర్ ధ్యానచంద్రను శనివారం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా శ్రీనివాసరెడ్డి, పలువురు టిడిపి కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి ఫ్లోర్‌లీడర్ అరవ వెంకట సత్యనారాయణ, టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), కార్పొరేటర్లు ముమ్మనేనిప్రసాద్, పొట్లూరి శివసాయి ప్రసాద్, చన్నగిరి రామమోహన్‌రావు, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, వల్లభనేని రాజేశ్వరి, వైసిపి కార్పొరేటర్లు తాటిపర్తి కొండారెడ్డి, వల్లూరి ఎన్‌డిఎస్ సత్యనారాయణమూర్తి, తంగిరాల రామిరెడ్డి, భీమిశెట్టి ప్రవల్లిక తదితరులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



విఎంసి నూతన కమిషనర్ ధ్యానచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్నటిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, పలువురు టిడిపి కార్పొరేటర్లు

ఐద్వా శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులు సోమవారం కూడా కొనసాగుతాయి. విజయవాడలోని మెట్రో హనుమంతరావు శ్రామిక భవన్లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా ఐద్వా సీనియర్ నాయకురాలు కుందనాల శేషుమణి పతాకాన్ని ఆవిష్కరించారు. ఐద్వా పశ్చిమ సిటీ కమిటీ కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి ఈ తరగతులను ప్రారంభించారు. ప్రన్సిపాల్‌గా ఝాన్సీ వ్యవహరించారు. "ప్రస్తుత రాజకీయాలు – మహిళలపై ప్రభావం' అన్న అంశాన్ని ఎస్.వెంకట్రావు బోధించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్.వెంకట్రావు

బండారుగూడెం మాజీ సర్పంచ్ ఉప్పులేటి ప్రసాదరావుకు నివాళి

హనుమాన్ జంక్షన్ : వ్యక్తిత్వంలో తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్న ఉప్పులేటి ప్రసాదరావు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బండారుగూడెంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పులేటి ప్రసాదరావు 33వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బండారుగుడెంలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. గ్రామంలోని ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. బండారుగుడెం సర్పంచ్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గ్రామ సర్పంచ్‌గా ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉప్పులేటి నేతాజీ, సత్యప్రసాద్, సుందర ప్రసాద్, దేవిప్రసాద్, డాక్టర్ తారక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పులేటి ప్రసాదరావు దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉప్పులేటి నేతాజీ, సత్యప్రసాద్, సుందర ప్రసాద్, దేవిప్రసాద్, డాక్టర్ తారక ప్రసాద్

కెడిసిఎను సందర్శించిన ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణా డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ (కెడిసిఎ)లో లో క్రికెట్ నేర్చుకునే క్రికెటర్లు మరింతగా రాణించేందుకు అవసరమైన అంతర్జాతీయ ప్రమాణాలు కల్పిస్తానని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని కృష్ణా డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఎంపి కేశినేని శివనాథ్‌ను అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ పిల్లలతో సరదాగా కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. అనంతరం క్రీడాకారులతో మాట్లాడి క్రికెట్‌లో నైపుణ్యం పెంచుకునేందుకు ఎలాంటి సదుపాయాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. కెడిసిఎ కోసం సొంత గ్రౌండ్ ఏర్పాటు కోసం కషి చేస్తానని ఎంపి అన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిఎ వైస్ ప్రెసిడెంట్ బాజీ షరీఫ్, సెక్రటరీ రవీంద్ర చౌదరి, కోశాధికారి జి.ఎన్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ శ్రీధర్ పాల్గొన్నారు.



కెడిసిఎ సభ్యులతో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

మొదటిపేజీ తరువాయి

పార్టీలకతీతంగా సుపరిపాలన

చేయాలని, తద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాలు లేని చోట్ల మంజూరు చేయాలని, పాఠశాలల్లో టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు అభివద్ధి చేయాలని, ఆట స్థలం సమస్యలు ఉంటే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ అంశాల్లో జరిగిన చర్చలో జిల్లాలో సాగునీటి, మురుగునీటి కాల్వల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఇంతవరకు చేపట్టకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ప్రస్తావించారు. వచ్చే ఏడాది నుంచి ముందుగానే కాల్వల నిర్వహణ పనులు, మురుగు కాల్వల్లో సిల్టు తొలగింపు పనులు చేపట్టేలా చూస్తామని మంత్రి, జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించేలా ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడం లేదని సభ్యులు ప్రస్తావించగా, ఫీజు రెగ్యులేషన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. జడ్పీటీసీలు ఆగస్టు 15 తేదీన జెడ్పి పాఠశాలల్లో జాతీయ జెండా ఎగరవేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరగా రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి అన్నారు.

తప్పులు చేసే అధికారులను ఉపేక్షించేది లేదు : మంత్రి

ప్రభుత్వం ఏర్పడి 50 రోజులవుతున్నా కొంతమంది అధికారుల్లో ఇంకా మార్పు రావడంలేదని మంత్రి కొల్లు అన్నారు. అలాగే తప్పులు చేస్తే ఏ అధికారినీ ఉపేక్షించొద్దని కలెక్టర్‌ను ఆదేశించారు. అవినీతి ఆరోపణలు వస్తే వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత ప్రభుత్వంలో తప్పులు చేసిన ఏ అధికారినీ వదిలే ప్రసక్తి లేదన్నారను. వారు ఎక్కడ ఉన్నా తీసుకొచ్చి విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే మచిలీపట్నంలో గత ప్రభుత్వ హయాంలో దొంగ పట్టాలు సష్టించి ప్రజలను మోసం చేసిన అధికారులపై చర్యలకు ఉపక్రమించినట్లు చెప్పారు.

జలాశయాల్లో నీరున్నా కాల్వల్లో నీరు లేదు : పలువురు శాసన సభ్యులు

జలాశయాల్లో తగినంత నీరున్నా కాల్వలకు నీటిని వదలకపోవడంతో సాగునీటికి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అవనిగడ్డ, పెడన, గుడివాడ, పామర్రు శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, కాగిత కష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా అన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు గత ప్రభుత్వ ఛాయలు ఇంకా వీడినట్లు లేదన్నారు. కాల్వలకు నీరు ఎందుకు విడుదల చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర జోక్యం చేసుకుని ఎంఎల్‌ఎల ప్రశ్నకు ఇరిగేషన్ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గుడివాడ, బందర్ డివిజన్ ప్రాంతాల్లో వెద సాగుపై పంటలు వేయడంతో అవి మునిగిపోయాయని, అందువల్ల కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశామని బదులిచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ అధికారులు ఇకపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమయానికి సాగునీటిని, తాగునీటి అవసరాలకు సక్రమంగా నీటిని విడుదల చేయాలన్నారు. అలాగే గహ నిర్మాణ శాఖ, నాడు నేడు పనులలో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని, లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చేందుకు దిగుమతి చేసుకున్న ఇనుము, సిమెంట్ లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు కొన్నిచోట్ల బయటపడుతున్నాయని అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి అన్నారు. అలాగే నాడు నేడు పనులు చేయకుండానే బిల్లులు చెల్లింపులు జరిగినట్లు తెలిసిందన్నారు. వీటిపై సమగ్రంగా విచారించాలని కోరారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి... జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులను జిల్లా పరిషత్ స్థాయి సంఘాల్లో సభ్యులుగా జడ్పిటిసి సభ్యులు ప్రతిపాదించగా, సమావేశం ఆమోదించింది. జడ్పీ సీఈవో ఆనంద కుమార్ తొలుత సభకు స్వాగతం పలికి అజెండా అంశాలు వివరించారు. ఈ సమావేశంలో కష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, 3 జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను త్వరగా పూర్తిచేయండి

డబ్బులు కూడా కట్టవుతున్నాయని చెప్పారు. ఇల్లు ఇవ్వకుండా, లబ్ధిదారులకు తెలియకుండా రుణం ఎవరు తీసుకున్నారో ప్రభుత్వం విచారించాలని డిమాండ్ చేశారు. మొత్తం 1530 మంది టిడ్కో లబ్ధిదారులు సొంతింటి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టిడ్కో గహ సముదాయాలతోపాటు మౌలిక వసతులు కల్పించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో సెంటు ఇళ్ల స్థలం మాత్రమే ఇచ్చారని, కానీ ఆస్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు కాకుండా లబ్ధిదారుడుకి అదనంగా రూ.8 లక్షలు అవుతోందన్నారు. దీంతో లబ్ధిదారులు మూడు రూపాయల వడ్డీకి అప్పుతీసుకుని తీర్చలేకపోతున్నారని చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని డి.వి.కష్ణ విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
ఆదివారం 28 జూలై 2024

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి : మంత్రి కొల్లు



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా సమగ్ర అభివద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా కృషి చేద్దామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంయుక్త కలెక్టర్ గీతాం జలి శర్మలతో కలిసి శాసన సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథ కం, పంచాయతీరాజ్, రహదారులు భవనాలు, రవాణా శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి పథకాలు, కార్యక్రమాలను కట్టుదిట్టంగాఅమలు చేసేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు శాసనసభ్యులు అందరూ కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు మేలు జరిగే పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. అలాగే ప్రమాదాల నివారణ కోసం రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరు విధిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో గుడివాడ, గన్నవరం,పెడన, పామర్రు శాసనసభ్యులు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు కాగితపు కష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, డిఆర్వో కే చంద్రశేఖర రావు, డిటిసి పురేందర్, ఆర్డిఓ ఎం వాణి, సిపిఓ గణేష్, డ్వామా పిడి జి వి.సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ్ కుమారి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు, డిపిఓ నాగేశ్వర నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : మంత్రి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యకు అగ్ర పీఠం వేస్తున్నామని, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఆశీర్వాద్ భవనంలో శనివారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మచిలీపట్నం చరిత్రను మార్చుతున్నామని అన్నారు. కష్ణా జిల్లాలో ప్రభుత్వపరంగా ఉన్న ఏకైక మహిళ బాలికల జూనియర్ కళాశాలకు కావలసిన అదనపు గదుల నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామని ఆయన విద్యార్థినుల హర్షద్వానాల మధ్య హామీ ఇచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ అయనంపూడి ఆనంద కుమార్ కళాశాల చరిత్రను తెలియజేశారు. కళాశాల అభివద్ధి కమిటీ మాజీ కార్యదర్శి సిటీ కేబుల్ ఎండి కొల్లు శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి ఎస్ సాల్మన్ రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భగత్, మాజీ జడ్పిటిసి సభ్యులు లంకె నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని జొన్నల వారి మోడీలో గ్రామంలో శుక్రవారం రాత్రి అడ్డాల అంజమ్మకు చెందిన పూరిపాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది.ఈ ప్రమాదంలో అంజమ్మ ప్రాణాలతో బయటపడింది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ కుటుంబ సభ్యులు జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ దష్టికి తీసుకురావడంతో స్పందించిన రామకష్ణ వెంటనే అంజమ్మను పరామ ర్శించి జన సైనికులు నాగబాబు సూర్య,మహేష్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దేవా సహకారంతో అంజమ్మకు 15వేలరూపాయలు నగదు నిత్యవసరాలు అందజేశారు.

బాలలను ఉన్నత ఆశయాల వైపు తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారిని ఉన్నత ఆశయాల వైపు వారి బాల్యం నుంచే తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ అరుణాసారిక అన్నారు.శనివారం మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల హక్కుల న్యాయ చట్టాలపై నిర్వహించిన శిక్షణా తరగతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో దాదాపు 25 శాతం ఉన్న బాలల హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యతా రాహిత్యం, కుటుంబ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చెడు స్నేహాల ప్రభావంతో సమాజంలో బాలలు నేరప్రవత్తి వైపు పయనించేందుకు ఎక్కువ ఆస్కారం ఉందన్నారు. బాలలు సన్మార్గంలో పయనించేందుకు తల్లిదండ్రులు, బంధు వులు, టీచర్ల ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హెూమ్ సూపరింటెండెంట్ పి రామ్మోహన్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



మాట్లాడుతున్న డాక్టర్ పెద్దు ప్రదీప్

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవలసిన తరుణంలో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం చిత్తై బంగారంలాంటి బతుకు బూడిదకన్నా హీన మవుతుందని ఇంగ్లాండ్లో స్థిరపడి ఉయ్యూరుకు చెందిన ప్రముఖ సైక్రియా సిస్ట్ వె బిద్యుడు పెద్దు ప్రదీప్ అన్నారు. డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్టు, ఏజీఅంర్ఎస్ఎస్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మాదక ద్రవ్యాలు – యువతపై వాటి ప్రభావం అనే అంశంపై కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టీనేజ్ పిల్లలు తెలిసి తెలియక మత్తుకు అలవాటు పడితే వ్యసనంగా మారి జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. నేటి మత్తుపదార్థాలు సమాజంలో పెద్ద జాడ్యంలా తయారయ్యాయని ఎక్కడ చూసినా మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలు లభ్యమవడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. వీటి వాడకం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబ సభ్యులతో ప్రేమాను రాగాలు తగ్గి ఆర్థిక ఇబ్బందులు మొదలవుతాయన్నారు. ఒక దశలో వీటికి బానిసై జ్ఞాపకశక్తి తగ్గి అ సలేమి నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారన్నారు. ఈవ్యసనం నుంచి బయట పడడానికి తనమీద తనకు గౌరవం, నమ్మకం అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శివనాథ్ అధ్యతన జరిగిన సదస్సులో ప్రత్యేక అధికారి కె. సత్యనారాయణ, డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ జనరల్ సెక్రట రీ కె.స్వరూపరాణి, కోశాధికారి డాక్టర్ నీరజ, లయన్ల క్లబ్ ఉయ్యూరు అధ్యక్షుడు నేరెళ్ల తేజసాయి వెంకట్ పాల్గొన్నారు.

న్యూటన్ గార్డ్ ఏర్పాటు

ప్రజాశక్తి-చల్లపల్లి స్థానిక నారాయణరావు నగర్ ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన న్యూటన్ గార్డ్లో మండల విద్యాశాఖ అధికారి2 పరిశే వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం మొక్కలు నాటారు. అనంతరం మొక్కల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు కైతేపల్లి దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాధా,మదాసీ రత్న కుమారి, కనగాల పవన్ కళ్యాణ్, ఉపాధ్యాయులు, చంద్ర ఈ.విజయ దుర్గ రాధారాణి, రవీంద్ర పాల్గొన్నారు. వంగా,టమోటా, పచ్చి మిర్చి,,గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలి కూరతోపాటు కాయగూరలు ఆకుకూరలు విత్తనాలు చల్లారు.



మొక్క నాటుతున్న విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు

మల్లంపల్లి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గుడివాడ : మల్లంపల్లి వెంకట్రావ్ తన తండ్రి పిచ్చియ్య జ్ఞాపకార్థం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం అభినంద నీయమని లయన్స్క్లబ్ ప్రగతి అధ్యక్షులు నల్లారి శేషగిరిరావు అన్నారు. శనివారం స్థానిక పాటిమీద గల కరుణా పీఠంలోని వృద్ధులకు లయన్స్క్లబ్ జిల్లా రిజియన్ సెక్రటరీ, క్లబ్ సర్వీస్ చైర్పర్సన్ మల్లంపల్లి వెంకట్రావు రొట్టెలు, పండ్లు పంపిణి చేశారు. క్లబ్ సభ్యులు మహంకాళి వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పెనమలూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణంతో గత ఏడాది అక్టోబర్ 14 తేదీన మరణించిన హెడ్ కానిస్టేబుల్ చంద్ర నాగరాజు కుటుంబానికి తమవంతుగా జట్టు స్ఫూర్తితో రూ 63 వేలు సమకూర్చి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు చేతులమీదుగా హెడ్ కానిస్టేబుల్ భార్య అనిత, ఆయన కుమార్తె మోనాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ మృతి బాధాకరం అన్నారు. ఏ సహాయం కావాలన్నా చేయటానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.



చిల్లర దుకాణాల్లో తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ బిందు

మైనర్లతో పనిచేయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : దుకాణాలలో బాలకార్మికులు, మైనర్లతో పని చేయిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ లేబర్ ఆఫీసర్ విఎస్ బిందు హెచ్చరించారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిందు మాట్లాడుతూ మైనర్లను దుకాణాల్లో పని చేయిస్తే యాజమానులకు జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. కార్మిక చట్టం ప్రకారం సమాన పనికి సమాన వేతనం దుకాణ యజమానులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో పేరు మార్పులు, యజమానుల మార్పులు ఉంటే వెంటనే లేబర్ ఆఫీసులో సంప్రదించాలన్నారు.

హుస్సేన్ మాస్టర్ సేవలు ఆదర్శం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు,మాజీ సైనికులు, హెచ్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ మాస్టర్ అకాల మృతి దిగ్భ్రాంతి కు గురి చేసిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మాస్టర్ సంస్మరణ సభ మచిలీపట్నం లోని సన్ స్టార్ స్కూల్ నిర్వమించారు. ఈ సభలో అప్స రాష్ట్ర కౌన్సిల్ ఛైర్మన్ కె.చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు సుందర్ రామ్, కష్ణా జిల్లా అధ్యక్షులు గౌరిప్రసాద్, సెక్రటరీ ఆజ్మతుల్లా ఖాన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు జాన్,కె.మోహనరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వి ఆర్.కె నగర్ సభ్యులు ముమ్మారెడ్డి వెంకట కష్ణారావు భార్య లలితాదేవి జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాయపాటి రాధాకష్ణ ఆధ్వర్యాన బందరు రోడ్డు పార్వతమ్మ తోట ఆదరణ వృద్ధాశ్రమం, నిమ్మల తోటలోని సీయోను వృద్ధాశ్రమాలలో 50 మంది వృద్ధులకు అన్నదానం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంధు మిత్రులతో పాటు, చల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొల్లిపర నాగ పోతరాజు , సీనియర్ సభ్యులు తగిరిశ సాంబశివ రావు , సెక్రటరీ కస్తూరి వెంకట వర ప్రసాదు , వైస్ ప్రశిడెంట్ ఉప్పల సాంబశివ రావు –ాల్గొన్నారు.

మంచినీటి ఇబ్బందులను పరిష్కరించాలి : సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్లో మంచినీటి సమస్యలు పరిష్కరించాలి సిపిఎం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మంచినీటి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంచినీటి పరిష్కారంపై నగరపాలక సంస్థ సిఇ, సర్కిల్ 1 ఇఇతో పాటు కార్పొరేటర్ బోయి సత్యబాబు మహంతీపురం ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. నీరు రంగు మారి రావడం, నీటి సరఫరా తక్కువగా రావడం, బోరింగులు పాడైపోయివి మరమ్మతులు చేయకపోవడం వంటి సమస్యలను విఎంసి అధికారులకు తెలిపారు. వాటర్ పైపులైన్ కోసం తవ్విన గోతులు పూడ్చక పోవటం, ప్యాచ్ వర్కులు చేయకపోవడం, పాత పాడైపోయిన పైపులైన్ల స్థానంలో కొత్త వాటర్ పైప్లైన్ ఏర్పాటు చేయడం తదితర సమస్యల పరిష్కారంపై కమిషనర్‌కి వినతి పత్రాలు ఇచ్చినట్లు సత్యబాబు తెలిపారు. దీనిపై స్పందించిన



అధికారులు పరిశీలించారని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ వాటర్ సప్లై విభాగంలో సిబ్బంది కొరత వలన ప్రజల ఫిర్యాదులు పరిష్కారంలో జాప్యం అవుతున్నాయని, సిబ్బంది సంఖ్యను వెంటనే పెంచి ప్రజల ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని కోరారు.



డిటిడిసి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విజయవాడ : డొమెస్టిక్ కొరియర్ కార్గో సంస్థ డిటిడిసి 35వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని విజయవాడ శాఖల ఆధ్వర్యంలో నగరంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాతబస్తీ గట్టు వెనుక ప్రాంతం భవానీపురంలో ఉన్న ఎస్‌కెసివి చిల్డ్రన్ హోమ్‌లో బాలలకు పౌష్టికాహారం, సబ్బులు షాంపూ, టూత్ బ్రష్, పేస్ట్ తదితర వస్తువులు అందజేశారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 40 మంది సిబ్బంది చేశారు. రూరల్ మండలం పాతపాడులో ఉన్న సూర్య కాంతి వృద్ధాశ్రమంలో రెండు నెలలకు సరిపడా బియ్యం, పప్పులు అందజేశారు. ఈ కార్యక్రమాలకు డి టీ డీ సి సంస్థ ప్రతినిధులు పాలకొల్లు రాజు , తలశిల బసవ పూర్ణచంద్రరావు, వై వి చలపతిరాజు, ఏ సత్యనారాయణలు నేతత్వం వహించారు.

అబ్దుల్‌కలామ్ వర్ధంతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త భారతరత్న అబ్దుల్‌కలామ్ అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని షేక్ ఆసిఫ్ కార్యాలయంలో అబ్దుల్‌కలామ్ పదో వర్ధంతి సందర్భంగా శనివారం నివాళులర్పించారు. అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాజీ షాహిద్ కర్రీ గౌరీ మురళి నాయక్ రెహమాన్ భాయ్ గిరి రషీద్ హై తదితర నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



ప్రజాశక్తి - భవానీపురం : జనసేన క్రియాశీల సభ్యత్వానికి ఎల్లెడలా మంచి ప్రజాదరణ లభిస్తోందని జనసేన విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ చెప్పారు. శనివారం స్థానిక 45వ డివిజన్లోని సితార సెంటర్ వద్ద జనసేన క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమం లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా లభిస్తుందని, శాశ్వత పూర్తి వైకల్యం సంభవిస్తే రూ.5 లక్షలు, పాక్షిక శాశ్వతవైకల్యం సంభవిస్తే 2.5 లక్షలు, ఏదైనా ప్రమాదంలో గాయాలపాలైతే రూ.50 వేలు మేర హాస్పిటల్ కు సంబంధించిన ఖర్చులు కూడా బీమా రూపంలో వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రి శివకష్ణ, తంగా రవికుమార్, పెద్ది రెడ్ల సతీష్, మనుకొండ పాపారావు, సిరిపురం జోషి కిరణ్, పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి కంచికచర్ల : బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పెండ్యాల సర్పంచ్ మల్కాబానో, షేక్ షబ్బీర్ తెలిపారు. పెండ్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల్య వివాహాల నివారణ, బేటి బచావో, భేటీ పడావోలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలు వివరించారు. బాలల చట్టాలపై బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాల్యవివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి బాల్యవివాహాలు అరికట్టేందుకు సహకరించాలని కోరారు. మహిళా పోలీసులు, పంచాయితీ సెక్రటరీ, ఐసిడిఎస్ సిబ్బంది బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. సూపర్వైజర్ కరిమ, అంగన్వాడి కార్యకర్తలు, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, లీగల్ క్యాంప్ ప్రొహిబిషన్ ఆఫీసర్ కట్ట కిరణ్ కుమార్, ఐసిడిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శాస్త్రవేత్తగా, ప్రజా రాష్ట్రపతిగా, విద్యార్థులకు మార్గనిర్దేశకునిగా, రచయితగా అసమాన ప్రతిభా పాటవాలు చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అని టిడిపి జాతీయ కోశాధికారి, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శివాలయానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని పాలేటి ఒడ్డున గల పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునరనిర్మాణానికి యాత్రికులు దోరేపల్లి ప్రసాద్ శనివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50,116లు ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళంగా అందజేశారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆగస్టు 15న ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ పనులను స్థానిక నేతలతో కలిసి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరిశీలించారు. ఈ సందర్భం గా నాణ్యతతో త్వారతగతిన పూర్తిచేయాలని సూచించారు.

ఆధార్ అప్‌డేట్ కార్యాలయం ప్రారంభం

జగ్గయ్యపేట: ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్‌లోని తప్పులను సరి చేసుకోవచ్చని జగ్గయ్యపేట మున్సిపల్ పదో వార్డ్ కౌన్సిలర్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఐదో సచివాలయంలో ఆధార్ నమోదు మార్పులు చేర్పుల కరెక్షన్స్ కేంద్రాన్ని రామలక్ష్మి ప్రారంభించారు. ఆధార్ అప్డేట్ చేసుకున్న వారికి నమోదు కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సెక్రెటరీ పొదిల రంజిత్ కుమార్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కమ్మిల చంద్రమౌళి పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం : టిడిపి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగన్ ఐదేళ్ల దుర్మార్గ పాలన నుంచి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు విముక్తి అయ్యారని జగన్ పరిపాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలియజెప్పేందుకే చంద్రబాబు నాయుడు శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. శనివారం రఘురామ్ స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగన్ శాసనసభకు రాకుండా మొదటి రోజు మాత్రమే వచ్చారన్నారు. ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసి అభాసుపాలై వెనక్కి వచ్చి శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టారన్నారు. తానింక శాసనసభకు రానని చెప్పడంలో ఏ రకంగా ప్రజలకి బాధ్యత వహిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు తాళ్లూరు వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్, కౌన్సిలర్ పాల్గొన్నారు.

గంజాయి నివారణకు వంద రోజుల ప్రణాళిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా గంజాయి రహిత జగ్గయ్యపేట లక్ష్యంగా స్పెషల్ ఫోర్స్ మెంట్ బ్యూరో జగ్గయ్యపేట స్టేషన్ వారు రాబోయే 100 రోజులలో వారు చేపట్టబోయే కార్యాచరణను జగ్గయ్యపేట స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. పట్టణంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో, జగ్గయ్యపేట పట్టణంలో వైయస్సార్ సర్కిల్లోను భారీ ఫ్లెక్సీలను, హోర్డింగ్స్ ఏర్పాటు చేసి గంజాయి రహిత జగ్గయ్యపేట కోసం రాబోయే వంద రోజులలో తాము ఏయే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామో ప్రజలకు వినూత్న రీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జగ్గయ్యపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో మరిన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్‌లోనూ, నేషనల్ హైవే మీద మరిన్ని హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక ఆటో సాండ్‌లో ఆటోలకు డ్రగ్స్, గంజాయి గురించి అవగాహన కల్పించే స్టిక్కర్స్‌ను అంటించారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు 9440902461 నెంబర్‌కు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మత్తుకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే యువత చక్కని భవిష్యత్‌ను సొంతం చేసుకుంటుందని విజయవాడ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆర్వీ రామశివ అన్నారు. ఏపీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో భవానీపురం స్టేషన్, కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం 'మత్తు పదార్థాల నివారణ'పె అవగాహనా సదస్సు ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన ఆర్వీ రామశివ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో భవానీపురం సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ యువత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన ఉపాధిని పొందాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత ఉన్న దేశం భారతదేశమని చెప్పారు. ఎన్‌సిసి ఆఫీసర్ కెపిటి విజయభాస్కర్, ఎన్ఎస్-ఎస్ పిఒలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, కల్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

మినుము, పత్తి పంటల సందర్శన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మండలంలోని దాములూరు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మనీషా మినుము పత్తి పొలాల సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో రసం పీల్చే పురుగు పచ్చి దోమల ఉధృతి నుంచి కాపాడుకునే విధానం గురించి శిక్షణ ఇచ్చారు. పత్తి పండ్లు రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే దోమ పిల్ల, పెద్ద పురుగులు ఆకు అడుగు భాగంలో చేరి ఆకుల నుండి రసం పిలుస్తాయన్నారు. దీనివల్ల ఆకులు మొదట లేత పుష్పకంలోకి మారి తదుపరి ఆకు అంచులు ముదురు ఎరుపు రంగులోకి మారి క్రమేపి ఆకులు మొత్తం ఎర్రబడి వెండి రాలిపోతాయని తెలిపారు. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కల్లో ఎదుగుదల క్షీణించి గిడసబారిపోయి నష్టం వస్తుందన్నారు. దీని నియంత్రణకు పత్తిలో అంతర్పంటగా పెసర మినుము కొర్ర



వంటి పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగులు వృద్ధి చెంది సహజంగా దోమ ఉధృతి నివారించుకో వచ్చన్నారు. మినుప పంట పూత దశకు వస్తుందన్నారు. కనుక వేప నూనెను పిచికారి చేసుకోవడం వల్ల మారికమచర్ల పురుగును నియంత్రించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని డి.శైలజ, గ్రామ సర్పంచ్ సిహెచ్.మధుసూదన్‌రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.నరేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీపురం : కె.ఎల్.రావు హెడ్‌వాటర్ వర్క్స్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. కుమ్మరిపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ నెల 28న ఆదివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు కుమ్మరిపాలెం సెంటర్, కొట్టేటి కోటయ్య వీధి, నాలుగు స్తంభాల సెంటర్, గుప్త సెంటర్, సాయిబాబా టెంపుల్ సెంటర్, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసినదిగా కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 20 కంపెనీలు ప్రజాప్రతి నిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. వివిధ గ్రామాల నుంచి 271 మంది అభ్యర్థులు హాజరయ్యారు తొలివిడతగా 142 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మరో 79 మందికి తరువాత ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేస్తామని జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు. యువత ఇటువంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని భవిష్య త్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల సిపిడిసి మెంబర్స్ గోగుల ముడి సాంబశివరెడ్డి, జెడ్ నాగిరెడ్డి దేవరపల్లి సీతారామిరెడ్డి, కళాశాల ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.వెంకటాద్రి కళాశాల సిబ్బంది ఎపి ఎస్ఎస్డిసి సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికుల ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గా ఘాట్‌లో నదిస్నానం చేసే యాత్రికుల ఇబ్బందులు తొలగించాలని నదిస్నానం కోసం వచ్చే మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు నిర్మాణం చేయాలని, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు దుర్గా మల్లేశ్వర దేవస్థానం ఇఒ కె.ఎస్.రామా రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. దాసరి రమణ, కర్రీ సాంబయ్య, పసుపులేటి రాజశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్‌లోని గాంధీజీ కళాశాల్లో సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం జరిగింది. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజ శేఖర్ బాబు అదేశాల మేరకు వెస్ట్ జోన్ డిసిపి పర్య వేక్షణలో, వెస్ట్ డివిజన్ ఎసిపి మురళీకృష్ణారెడ్డి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గా శేఖర్ రెడ్డి, వారి సిబ్బందితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీజీ మహిళా కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి సమాజంలో విస్తృతంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న ఆర్థిక నేరాలు (సైబర్ క్రైమ్) గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ మహిళా కాలేజ్ యాజమాన్యం తో పాటు వెస్ట్ డివిజన్ ఏసిపి మురళీ కష్ణ రెడ్డి , వన్ టౌన్ ఇన్స్పెక్టర్ దుర్గా శేఖర్ రెడ్డి అలాగే సైబర్ క్రైమ్ సిఐ శ్రీను, వన్‌టౌన్ ఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గా శేఖర్‌రెడ్డి


వెంకటాద్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా కొసరాజు వెంకటాద్రి జయంతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు, గుడ్లవల్లేరు మండల టిడిపి మాజీ అధ్యక్షులు స్వర్గీయ కొసరాజు వెంకటాద్రి చౌదరి 72వ జయంతి వేడుకలు కొసరాజు సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు గ్రామంలో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పలువురు మండల ప్రముఖులు, టిడిపి నేతలు పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ కొసరాజు వెంకటాద్రి చౌదరి విగ్రహానికి ఎమ్మెల్యే రాము మండల పెద్దలు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం పక్కనే ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా స్వర్గీయ కొసరాజు వెంకటాద్రి చౌదరి స్ఫూర్తితో సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి వాటర్ ట్యాంకర్ ను ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ వేడుకల్లో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడాలి రామరాజు , సీనియర్ టిడిపి నాయకులు జంగం మోహనరావు, వల్లభనేని వెంకట్రావ్,అడుసుమిల్లి రామ్మోహన్రావు, అట్లూరి శ్రీ రామచంద్ర ప్రసాద్,సర్పంచ్ కాగిత నరేంద్ర ,గరికపాటి రాంబాబు,చాపరాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్) : హనుమాన్‌జంక్షన్ సిద్ధార్థ విద్యాలయ స్కూల్లో 'అమ్మ పేరుతో మొక్క నాటుదాం' అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన విద్యావిదానంలో భాగంగా శనివారం మండల విద్యాధికారి బట్టు సురేష్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100కు పైగా మొక్కలను పిల్లలు వారి తల్లితండ్రుల సమక్షంలో నాటించినట్లు స్కూల్ ప్రదానోపాధ్యాయురాలు వీరమాచినేని ధనలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం గాంధీ క్షేత్రంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండ లి వెంకట్ రామ్ పూలదండలు వేసి నివాళు లర్పించారు. జనసేన ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు మట్టి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, టిడిపి జనసేన నాయకులు ఘంటసాల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలకుర్తి రమేష్ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పూలదండలు వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పద్మి రాజు, మండల యూత్ నాయకులు చింతలపూడి బాలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని విజయ అకాడమీ, చల్లపల్లి గ్రామపంచాయతీలో శనివారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి ఈఓ పీవీ.మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్ పెక్టర్ సుధాకర్, అనిత, కార్యాలయ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. విజయ అకాడమీలో ఉపాధ్యాయులు జవహర్, సెల్వం తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ కరీముల్లా షేక్ జాభర్, షేక్ సిలార్, షేక్ సుభాని, షరిఫ్, షేక్ గౌస్ భాజీ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మాజీ రాష్ట్రపతి డా ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతిని స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న దృశ్యం


సహజ యోగాతో మానసిక ప్రశాంతత



ప్రజాశక్తి-గన్నవరం : అనునిత్యం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చునని సహజ యోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి అన్నారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెంలోని జెడ్పీ పాఠశాలలో శనివారం సహజయోగ సాధనపై విద్యార్థినీ విద్యార్థినులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ సహజయోగ ప్రక్రియల ద్వారానూ, ధ్యానం చేయటం ద్వారా ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్వగుణాలను పెంపొందించుకోవచ్చునన్నారు. శారీరక, మానసిక ఉన్నతిని పొందొచ్చునని వివరించారు. సహజయోగ ధ్యాన కేంద్రం ఎన్‌టిఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ మాట్లాడుతూ సహజయోగంలో కుండలినీ చైతన్య తరంగాలను అన్ని పార్శ్వాలకు ప్రసరిస్తు న్నప్పుడు క్రమంగా ఈ నాడులన్నీ చైతన్యవంతం మవుతా యన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహజయోగి స్వాములు, పాఠశాల హెచ్ఎం జి వెంకటేశ్వరరావు, ఎస్.నాగశిరోమణి, ఎస్.లీల పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గన్నవరంలో ఈనెల 31వ తేదీన ఉదయం 9 గంటలకు స్పాట్ అడ్మిషన్లు జరుగున్నట్లు కళాశాల ప్రధానా చార్యులు ఏ. పద్మావతి తెలిపారు. దీనికి పదవ తరగతిలో ఉత్తీర్ణులు అయిన వారు, పాలీసెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది సీటు రానివారు, ఉత్తీర్ణత పొందని వారు అర్హులు అని తెలిపారు. కళాశాలలోని నాలుగు విభాగాల్లో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో, ఎలక్ట్రానిక్స్ విభాగం, మెకానికల్ విభాగంలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్స్ కు అటెండ్ అయ్యేవారు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్ (పదవ తరగతి మార్కులు లిస్ట్, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్, టిసి, స్టడీ సర్టిఫికెట్స్ ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు) రెండు సెట్లు జిరాక్స్ కావలెను తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలి పారు. అప్లికేషన్స్ కావలసినవారు కళాశాల ఆఫీసులో తీసుకోవా లని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.


విక్కుర్తి శ్రీనివాసులును సత్కరిస్తున్న తీర ప్రాంత రైతులు

విక్కుర్తి శ్రీనివాసుకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాసును ఆ ప్రాంతానికి చెందిన రైతులు శనివారం ఘనంగా సత్కరించారు. తీర ప్రాంత గ్రామాలైన దీన దయాలపురం, దిండి పుల్లయ్య గారి దెబ్బ, సోర్ల గొంది గ్రామాల పంట పొలాలకు గడచిన కొన్నేళ్లుగా సాగునీటి ఎద్దడి ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పూర్తి సామర్థ్యంతో సాగునీటిని విడుదల చేసినప్పటికీ కాలువలు కూడిక కారణంగా పొలాలకు నీరు అందడం లేదని ఇటీవల ఆ రైతులంతా శ్రీనివాస్ కు విన్నవించి సహాయం కోరగా స్పందించిన ఆయన దాదాపు రూ రెండు లక్షలకు పైగా వెచ్చించి ప్రొక్లైన్లను సమకూర్చి పూడిక తీయించే పనులను రైతుల ద్వారా చేయించారు. దీనితో ఆ ప్రాంత రైతులంతా శ్రీనివాస్ కు కతజ్ఞతలు తెలిపారు. పనులు పూర్తి కావడంతో శనివారం సాయంత్రం దిండి గ్రామం వద్ద శ్రీనివాస్ కు నాలుగు గ్రామాల రైతులు మహిళలతో కలిసి కాలువలకు పూజలు నిర్వహించారు. అనంతరం సోర్లగొంది గ్రామంలో ఆయా గ్రామాల రైతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నగడ్డ వెంకట్ నారాయణ, లోయ రామారావు, కట్ట వెంకటేశ్వరరావునాయుడు, రామయ్య, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, నాయుడు నరసింహారావు, విశ్వనాథపల్లి దుర్గారావు, కోపనాతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తూటుకాడ తొలగింపు పనుల పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : డ్రైనేజీ పనులు సమర్ధవంతంగా నిర్వహించాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీని బుద్ధప్రసాద్ పరిశీలించారు. నూతన ప్రభుత్వంలో శాసనసభ్యుల చొరవతో మంజూరు అయిన నిధులతో గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులు చల్లపల్లి డ్రైనేజీ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టగా ఈ మేరకు తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు పూర్తి కాగా పనులను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో రైతులకు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నూతన ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ కే హరీష్ పాల్గొన్నారు.




జోరుగా ఆర్గనైజింగ్ జూదం

తమ్ముడు.. నేను శంకరరావుని.. రేపు ఆదివారం.. ఆట గట్టిగా ఉంటుంది. ప్లేస్ ఎక్కడో ఉదయం చెబుతా .. రెడీగా ఉండండి.. ఇది పేకాట నిర్వాహకులు ఫోన్లో చేస్తున్న సంభాషణ. పేకాట రాయుళ్లు.. ఫోన్ సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్తారు.. ఆటలో దిగుతారు. విచిత్రం ఏంటంటే.. పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించేది.. వాళ్లే. మండలంలో కొద్ది రోజులుగా జరుగుతున్న తంతు ఇది. ఈ ఆర్గనైజింగ్ జూదం పై ప్రత్యేక కథనంలోకి వెళితే..

- రాత్రి వేళల్లో రహస్య ప్రాంతంలో నిర్వహణ
- రోజుకో ఊర్లో సాగుతున్న వైనం

పజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతంలో ప్రజా ప్రతినిధుల పేరు చెప్పుకొని కొంతమంది పేకాట నిర్వాహకులు ఆర్గనైజింగ్ జూదం కొనసాగిస్తున్నారు. రోజుకో ఊర్లో ఈ ఆట సాగుతోంది. అధికార పార్టీ వాళ్ళమంటూ పోలీస్ అధికారులను మేనేజ్ చేస్తున్నారని తెలుస్తోంది. వాళ్లు కూడా ఎందుకు వచ్చిందిలే అని చూసి చూడనట్టు వదిలేస్తున్న పరిస్థితి ఇక్కడ ఉంది. అప్పుడప్పుడు దాడులు చేసి పేకాట రాయుళ్లను పట్టుకుంటున్నారు. దీనికి చెందినదే మర్లపాలెం, తుట్టగుంట, బూతిమిల్లిపాడు గ్రామాల్లో దాడి చేసి పేకాటరాయుళ్లను పట్టుకొని కోర్టుకు పంపారు. డబ్బు ఎంత దొరికింది అనేది వెయ్యడాలర్ల ప్రశ్న. అయితే నిరాటంకంగా రహస్య ప్రదేశాల్లో రాత్రి వేళలో సాగుతున్న ఈ జూదం అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు డేక కన్ను వేశారని తెలుస్తోంది. జూదరుల్లో కొంతమందిని సమాచారం ఇచ్చేందుకు కానిస్టేబుళ్లు మేనేజ్ చేస్తున్నారని చెప్తున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగానే దాడులు చేస్తున్నారట. అయితే గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోనూ, బాపులపాడు మండలంలోని కొన్ని గ్రామాల్లో ఈ జూదం సాగుతోందని చెప్పాలి. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో ఆదివారం కోడిపందాలు వేస్తున్నారు. ఏదేమైనా గత ప్రభుత్వంలో నాలుగేళ్లు సాగిన జూదం ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడం విడ్డూరంగా ఉందని మహిళలు అంటున్నారు. పోలీసుల్లో బదిలీలు ఉంటాయని, దీంతో ఈ కొద్ది రోజులకు మనకెందుకులే అని అధికారులు కామ్‌గా ఉంటున్నారని వాదన ఉంది. ఈ ఆర్గనైజింగ్ జూదం వల్ల ఎన్నో పేద కుటుంబాలు చితికి పోతున్నాయి. నిజం చెప్పాలంటే ఈ జూదం లేకుండా చేయాలని, ఎవరైనా రహస్యంగా నడుపుతుంటే గట్టి చర్యలు తీసుకోవాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతి మీటింగులో చెబుతున్నారు. ఆ విధంగానే ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారట. పేకాట, కోడిపందాలను ఉపేక్షించకూడదని చెప్పారని తెలిసింది. అయితే పేకాట పెట్టే వాళ్లకు డబ్బులు బాగా దండిగా రావడంతో వదల్లేకపోతున్న పరిస్థితి ఇక్కడ ఉందని అంటున్నారు. ఏదేమైనా పోలీస్ అధికారులు ఆర్గనైజింగ్ జూదం పై ఉక్కు పాదం మోపితేనే గన్నవరం నియోజకవర్గం జూదం రహిత నియోజకవర్గం గా మారుతుందని చెప్పాలి.



సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - గంపలగూడెం : జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు స్థానిక మండల అధ్యక్షుడు శేషగిరి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, కాపాడుకునేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జి.అనురాధ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసుకుంటే మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని బోధించారు. మొదటగా సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక విధ్వంసానికి పాల్పడిన జగన్ : దేవినేని ఉమా

ప్రజాశక్తి, భవానీ పురం : ఐదేళ్లలో జగన్ రెడ్డి రూ.12,93,216 కోట్ల ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డాడని టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ రాకుండా జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర కార్యక్రమాలకు పాల్పడుతూ, తాడేపల్లి ప్యాలెస్‌లో బ్లూమీడియాకు పరిమితమయ్యారని మండిపడ్డారు. మీడియా ముందుకు వచ్చి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రిగా ఉండగా లేదని, మొన్న జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. పోలవరం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ రెడ్డికి లేదన్నారు. 2,400 మీటర్ల విస్తీర్ణం అని మాట్లాడుతున్నాడని, ఈయన ఎప్పుడు ఇంజనీర్ అయ్యాడో అర్థం కావడం లేదన్నారు. 2021 సంవత్సరంలో కేంద్రం నుండి డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ వచ్చి చెప్పే వరకు జగన్ రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందన్నారు. జగన్ నొక్కిన బటన్ నొక్కుడులో పేద వర్గాలకు ఎంత వెళ్లాయో తాడేపల్లి ప్యాలెస్‌కు ఎంత వెళ్లాయో ఆర్థికశాఖ విచారణ జరిపి లోతుగా అధ్యయనం చేయాలని ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యలపై అధికారులకు వినతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం మండల విద్యా శాఖాధి కారికి, తహశీ ల్దార్‌కి, ఎంపిడి ఒకు సమస్య లతో



కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల మండల అధ్యక్షులు టి.బాలభాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం గౌరవ అధ్యక్షులు ప్రకాష్ కోశాధికారి, కె.రవిబాబు, సహాధ్యక్షులు కె.విజయ్, కార్యదర్శులు ఎం.వి.కృష్ణారెడ్డి, కె.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, జి.రాయప్ప, బి.శ్రీనివాస్, ఎంవి.సుబ్బారావు, డిపి దస్తగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - మైలవరం : ఇటీవల మైలవరానికి చెందిన సాయి మాస్టారు ఆకస్మిక మృతి చెందారు. ఆయన కుటుంబానికి మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి



మాస్టర్ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి దాత ఎన్ఆర్ఐ సహకారంతో రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా మాట్లాడుతూ కుటుంబ పెద్ద మృతిచెందితే కుటుంబం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కుటుంబాలకు దాతల సహకారంతో తమ వంతు సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ విజయలక్ష్మి, కోశాధికారి డి విజయలక్ష్మి, సభ్యులు మాధవి, నాగమణి, శ్వేత, నాగలక్ష్మి, కవిత, నాగజ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

ప్రజాశక్తి - తిరువూరు : జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాల మేరకు తిరువూరు మండలంలోని చిట్టేల గ్రామంలో సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు అబెట్ మందును (దోమల మందు) పిచికారి చేయించారు. కాలువల్లో, ఖాళీ స్థలాల్లో, నిల్వ ఉన్న మురుగు నీటిలో స్ప్రే చేయించినట్లు సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి బాబువలి, కార్యదర్శి సత్యం, మలేరియా, హెల్త్ సూపర్వైజర్ మధుసూదనరెడ్డి, ఎ ఎన్ ఎం రామ కష్ణమ్మ, మస్తాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాత భవనం



ప్రజాశక్తి - గంపలగూడెం : పూర్వకాలం నాటి ఆ విద్యా భవనాన్ని తొలగించాలని విద్యార్థులు-తల్లిదండ్రులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. గంపలగూడెం మండలం కొత్త ఆర్లపాడు గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (పూర్వపు రేకుల షెడ్డు) భవనం. దానిని గానుగ సున్నం, సైజు రాళ్లతో నిర్మించిన పాఠశాల. కాలక్రమేణా, శిథిలావస్థకు చేరి ఏ క్షణమైనా కూలేందుదుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో నూతన భవనాన్ని నిర్మించి అందులో విద్యాబోధన కొనసాగిస్తోంది. కానీ ప్రమాదకరంగా మారిన ఆ పాఠశాల భవనాన్ని కూల్చలేదు. ఆ పాఠశాలకు వెళ్లే ముందే ప్రథమంగా మూత్రశాలలు, తరువాత పూర్వభవనం, ఆ తరువాత ప్రస్తుత పాఠశాల నూతన భవనం ఉంది. రాకపోకలకు ప్రతిసారి దానిని దాటుతూనే ఉండాలి. ఈ పరిస్థితుల్లో ఎవరి మీద పడుతుందో నన్న ఆందోళన నిత్యం విద్యార్థులను వేధిస్తుంది. ఈ పరిస్థితుల్లో గమనించిన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బండి వెంకటేశ్వర్లు ఇటీవల ఆ భవనాన్ని తొలగించాలని స్థానిక మండల పరిషత్‌లో అర్జీ చేసినట్లు సమాచారం. గ్రామస్తులు సైతం దీనిని చూస్తే భయపడక తప్పదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టే అవకాశాలు లేనందున నేరుగా ఆ ఉపాధ్యాయుడే సమాచారం ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో పీవీఎస్ నాగేశ్వరరావును సంప్రదించగా, కొద్ది రోజుల్లో భవనాన్ని తొలగింప చేస్తామని వివరించారు.

ఎంఇఒకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని జుజ్జూరు కేంద్రంలో ఉన్న ఎంఇఒ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు పుల్లమ్మ ఆధ్వర్యంలో ఎంఇఒకు వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ 20 ఏళ్లగా మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తున్న పలువురిని మండలంలో రాజకీయ కారణాలతో బలవంతంగా రాజీనామా చేయించారు. తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్న మధ్యాహ్నం భోజన కార్మికుల పొట్ట కొట్టడం రాజకీయ నాయకులకు తగదని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సిఐటియు అనుబంధ సంఘాలు



సంఘీభావం తెలిపాయి. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం భోజన కార్మికులను తొలగించడం సరికాదని తొలగించిన వారిని వెంటనే వీధిలోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపడుతామని వారు తెలిపారు.

పలుదేశాల కరెన్సీ, నాణేల ప్రదర్శన

ప్రజాశక్తి - తిరువూరు : మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వివిధ దేశాల కరెన్సీ నోట్‌లు, నాణాలను శనివారం ప్రదర్శించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని లక్ష్మీ శ్యామల సేకరించిన వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణాల గురించి ఆమె విద్యార్థులకు వివ రించారు. అమెరికా, నేపాల్, శ్రీలంక, యుఎఇ, థాయి లాండ్, మలేషియా, సింగపూర్, యూరప్ దేశాలకు చెందిన వాటిని, మన దేశంలో వివిధ కాలాలలో ఉప యోగించిన అణా,1,5,10,1/4, 2/4 పైసలు, కేంద్ర ప్రభుత్వం వివిధ సందర్భాలలో ప్రత్యేకంగా విడుదల చేసిన అనేక రకాల నాణాలను ప్రదర్శించి,వాటి చరిత్రను వివరించారు. ఈ ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.హరికృష్ణ, ఉపాధ్యాయులు సుజాత కుమారి, పద్మలత, సిఅర్పి ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికునికి సత్కారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ ఆపరేషన్‌లో ప్రత్యేకంగా పాల్గొన్న మాజీ సైనికులు శ్రీనివాసరాజును జగ్గయ్యపేట బిజెపి నాయకులు, స్వయం సేవకులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా పసుపులేటి శ్రీకృష్ణ దేశభక్తి గీతాన్ని ఆలపించారు. అనంతరం మాజీ సైనికులు శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ వారు ఆపరేషన్‌లో పనిచేసిన తీరును తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు కీసర రాంబాబు, పట్టణ నాయకులు డివి.సుబ్బరాజు, వేద సుబ్రహ్మణ్యం, పసుపులేటి శ్రీకృష్ణ, సత్యనారాయణ, పబ్బతి నరేంద్ర పాల్గొన్నారు.

క్వారీ ప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : క్వారీల్లో ప్రమాదాలు, పరిశ్రమల కాలుష్యంపై 2న ఇబ్రహీంపట్నం సెంటర్‌లో ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. ఇటీవల పరిటాల పరిధిలో గల పవన్ గ్రానైట్ అండ్ మెటల్ వర్క్స్ చెందిన క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. సిపిఐ జిల్లా బృందం శనివారం ఆ క్వారీని సందర్శించింది. అనంతరం దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రమాదాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికుల మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన 35 ఏళ్ళ రాందేవ్ భాగేల్ కుటుంబానికి రూ.16,89,150లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, కార్యదర్శి వర్గసభ్యులు చుండూరు సబ్బారావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, సిపిఐ జిల్లా కార్య వర్గసభ్యులు మల్నీడు యలమందరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగ్గయ్యపేట: మండలం లోని చిల్లకల్లు సమీ పంలో జాతీయ రహ దారిపై తరలి స్తున్న బియ్యం లారీని



అధికారులు గుర్తించి స్వాధీనం చేసు కున్నారు. పట్టుబడ్డ బియ్యం గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని పెదవడ్లపూడి నుంచి పిడిఎస్ బియ్యాన్ని ఒకసారి పాలిష్ చేసి 25 కేజీల పరిమాణం గల బ్యాగులలో నింపిన వెయ్యి బస్తాల బియ్యం లారీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెదవడ్లపూడి నుంచి ముంబైకి వే బిల్లులతో రవాణా అవుతున్న బియ్యం పట్టుబడ్డ బియ్యం శాంపిల్ పరీక్షలకు పంపిన అధికారులు ఆ బియ్యం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బయటకు వచ్చిన బియ్యంగా నిర్థారించిన అధికారులు పిడిఎస్ బియ్యంగా నిర్థారణ కావడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం'

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో కలిసి అమ్మ పేరుతో మొక్క నాటుదాం అనే పర్యావరణ పరిరక్షణ కోసం కార్యక్రమం శనివారం జరిగింది. పాఠశాలల్లో అమలుచేస్తున్న శిక్షా సాప్తాహ్ 6వ రోజున పాఠశాల హెచ్ఎమ్ బి.పద్మలత మాట్లాడుతూ ఇలాంటి అపురూప కానుక అమ్మ పేరుతో మొక్క నాటడం అనే విషయం గొప్ప సందేశాత్మక మరియు చాలా ప్రయోజనాత్మక కార్యక్రమం అని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం -2020 మొదలై 4వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న ఈ వారోత్సవాలు విద్యార్థులలో ఓ నూతన ఆలోచనలు కల్పిస్తాయని తెలుగు పి.జి.టి.ఉపాధ్యాయులు డి.నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఉపాధ్యాయులు రమాదేవి, మల్లీశ్వరి, మాధవీ లత, శారదా దేవి పీడీ రత్నం మొదలైన వారు విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ శ్రీ అమ్మవారి ఆలయానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం విచ్చేశారు. విరికి ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా ఇఒ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

మైలవరం సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి - మైలవరం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మైలవరం సర్పంచ్ మంజు భార్గవి రాజీనామా చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను మండల పార్టీ అధ్య క్షులు గర్నెపూడి వెంకటరావుకి అందజేశా నన్నా రు. కార్యాచరణ త్వరలో తెలియజేస్తానన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - మైలవరం : విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారి పివి.నరసింహారావు అన్నారు. విజయవాడకు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెడ్ సుంకర అక్కయ్య నాయుడు సౌజన్యంతో స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు శనివారం అచ్చు కాపీ పుస్తకాలను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందజేస్తున్న సౌకర్యా లను విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు ఉడత లక్ష్మీనారాయణ, అభి వృద్ధి కమిటీ సభ్యులు సుంకర సత్యనారా య ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్లబ్ డే

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని చిలుకూరు వారి గూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా క్లబ్ డేను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు అమ్మే ప్రేరణ కావాలని, అమ్మే ఒక స్ఫూర్తి కావాలని, అందరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎల్.బాలు, ప్రధానో పాధ్యాయులు నారాయణ రావు, ఎస్ ఎస్ ఏ జిల్లా ఏఎమ్ఒ అధికారి అశోక్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : లైన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌విఆర్ జిఎన్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ ఏ కోటిరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిం చారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు ఎంతో ప్రయోజకులు కావాలని కోరుకుంటున్నారని వారి ఆశలను అడియాశలు చేయవద్దన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఫిజికల్ ట్రైనర్ డాక్టర్ రమేష్ ప్రొజెక్టర్ ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం జోన్ చైర్మన్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీధర్, సెక్రెటరీ చనుమోలునాగభూషణం, ట్రెజరర్ కొల్లిపర నాగ ప్రసాద్, లయన్ క్యాబినెట్ మెంబర్ సిహెచ్.బాలగోపాల్ రెడ్డి, కళాశాల ఎఒ కృష్ణ కిషోర్, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఇన్చార్జ్ డిడి డాక్టర్.కష్ణమూర్తి శనివారం చందర్లపాడు (వి.డి), పొక్కునూరు, కొడవటికల్లు, గ్రామాల లో పశువైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. నిర్దేశించిన పశువులకు, జీవాలకు, గోవులకు సమయానికి వ్యాక్సిన్ వేయాలని అధికారులను ఆదేశించారు. సరైన సమయానికి వ్యాక్సిన్ వేయకపోతే తగు చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్. జ్యోతి బాబు సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో అవినీతిపై విచారణ చేస్తాం : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-ఘంటసాల : హౌసింగ్ స్కీమ్లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లుగా తన దృష్టికి వచ్చిందని విచారణ చేపట్టి నిగ్గు తేలుస్తానని, ఎవరిని ఊపేక్షించేదిలేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేమూరి రజనీ కుమారి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లుగా తెలుస్తుందన్నారు. పెద్ద ఎత్తున సిమెంట్, స్టీల్ అనధికారికంగా, విచ్చలవిడిగా పంపిణీ చేసినట్లుగా తన దష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఈ అవకతవకలపై రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించిందన్నారు. మంజూరు లేకుండా ఇల్లు కట్టుకోమని అనధికారికంగా ఉత్తర్వులు ఇవ్వటమేమిటని ప్రశ్నించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచ్, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా యండకుదురు గ్రామాన్ని అన్ని రకాలుగా అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు తుమ్మల మురళీకష్ణ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎండివో మారుతి శేషమాంబ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డలో ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ కోరారు. శనివారం ఆయన పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే 466 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పాఠశాలలో సిబ్బంది కొరత ఉందని, సైన్స్ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేరని, విద్యార్థులను చూసుకోవడానికి ఒక డిప్యూటీ వార్డెన్ అవసరం ఉందని, ప్రస్తుతం టీచింగ్ స్టాఫే ఈ బాధ్యత నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా విద్యార్థులు నివసించే బిల్డింగ్ పూర్తిగా శిథిలవస్థలో ఉన్నదని రెండవ అంతస్తు పూర్తిగా దెబ్బ తినడంతో విద్యార్థులు గ్రౌండ్ ఫ్లోర్ లోనే పడుకుంటున్నారని తెలిపారు. అందువల్ల అదనపు భవనం నిర్మించవలసి ఉందన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి మంగళగిరి : ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోని పరిష్కరించాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. శనివారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో మంగళగిరి ఎయిమ్స్ ఆటో వర్కర్స్ సిఐటియు మహాసభ జరిగింది. ఈ సభకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎంవి సుబ్బారావు అధ్యక్షత వహించారు. శివాజీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్టాల వలన ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిందని అన్నారు. వాగ్దానాల మేరకు అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులుగా వివి జవహర్లాల్, అధ్యక్షులుగా షేక్ కాజా, ఉపాధ్యక్షులుగా గాలి దేవ సహాయం, షేక్ రషీద్, ప్రధాన కార్యదర్శిగా ఎం వి సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా జిలాని, మౌలా సాహెబ్, కోశాధికారిగా బి కోటేశ్వరరావు, సభ్యులుగా షేక్ వలి, షన్ను, సాధిక్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి ఉద్యోగుల రోస్టర్లపై న్యాయం చేయాలి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రోస్టర్లపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సమీక్ష నిర్వహించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కష్ణా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రా సునీల్ కుమార్ ,మద్దాల కష్ణ కుమార్ లు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్యకు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి, సాంఘిక సంక్షేమ, సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయాల్లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రిక్రూట్మెంట్, ప్రమోషన్స్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ ల మీద ధర్మయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖతోపాటు మిగిలిన శాఖలలో కూడా రోస్టర్ రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేక పోవడాన్ని కమిటి గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్ నేతత్వంలోని జిల్లా స్థాయి అధికారుల కమిటీలు ఏ ఒక్క డిపార్టుమెంటును కూడా రోస్టర్ల తనిఖీ చేయకుండా ఎస్సీ ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్న వైనం ఈ తనిఖీ లో కనబడినట్లు తెలిపారు. ఎస్టి కేటగిరీలో అంగన్వాడీ వర్కర్లను నియమించకుండా ఇతర కులాలను నియమించడం అత్యంత గర్హనీయమైన చర్యగా కమిటీ పేర్కొంది. ఈ తనిఖీలలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షులు పల్లిపాటి అశోక్, కష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు కర్రా సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి మద్దాల కష్ణ కుమార్, కోశాధికారి జయప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక



సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న శివశంకర్




పోటీలకు ఎంపికై విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సీనియర్స్ సెలక్షన్స్ ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఘంటసాల మండల విద్యాశాఖ అధికారి ఎన్.శివశంకర్ హాజరై, సెలక్షన్స్ ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు తమ్మన వేణుగోపాల రావు పర్యవేక్షణలో, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గరికపాటి మారుతి ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, సాఫ్ట్బాల్ సెలక్షన్స్లో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులు అందరూ హాజరుకాగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యా యులు తమ్మన వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ఎంపికలో మొత్తంగా సీనియర్స్ బాలుర విభాగంలో 16 మందిని, అలాగే జూనియర్ బాలికల విభాగం నుండి 16 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్టులు వచ్చే నెల, అనగా ఆగస్టు 10, 11, 12 తేదీలలో పల్నాడు జిల్లాలో ఉన్న వినుకొండ గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో మన ఉమ్మడి కష్ణాజిల్లా నుండి ఆడటానికి ప్రతినిధ్యం వహిస్తారన్నారు. అలాగే జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్లు వచ్చే నెల ఆగస్టు 17, 18 మరియు 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా లోని, శ్రీకాకుళం టౌన్ లో జరిగే రాష్ట్రస్థాయి ఆటల పోటీ లకు మన ఉమ్మడి కృష్ణాజిల్లా తరపున ఆడతారని తెలిపారు.

ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విజయ జూనియర్ కాలేజ్, శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాలలో ఆవరణలో శనివారం అభినందించారు.

తూటికాడను తొలగించాలి : సిపిఎం



కాజ వద్ద తూటుకాడతో నిండిన గుంటూరు ఛానల్ పరిశీలిస్తున్న పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ : గుంటూరు ఛానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటి కాడను వెంటనే తొలగించి సాగునీటి సమస్య లేకుండా రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం, కాజా గ్రామంలో గుంటూరు ఛానల్ ను శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయిస్తున్నాం అంటూ కాలయాపన చేయకుండా గుంటూరు ఛానల్లో విపరీతంగా పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూటి కాడను తొలగించి పూడికలు తీయాలని డిమాండ్ చేశారు. తద్వారా రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనేక మండలాలకు సాగునీటిని అందించే పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ పూర్తిచేసి వాడుకంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గుంటూరు నుండి పర్చూరు వరకు ఛానల్ ను పొడిగించేందుకు నిధులు కేటాయించా లన్నారు. నల్లమడ ఆధునీకరణ కోసం నిధులు కేటాయించాలని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, బి. కోటేశ్వరీ, ఆళ్ల సాంబి రెడ్డి, గండికోట బాబు వరప్రసాద్, వట్రం పూర్ణయ్య, సింహాద్రి కోటిరెడ్డి, టి బ్రహ్మయ్య, మేడా శివయ్య, ఉద్దంటి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన

ప్రజాశక్తి - గుడివాడ : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పు లకు పిపిఎల్, జైకిసాన్ నూతన ఆవిష్కరణలు తీసుకువస్తుందని, అందులో భాగంగానే నానో శక్తి యూరియా. డిఎపిలను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్లు పిపిఎల్ ఛీఫ్ మేనేజర్ ఎం.డి రఫీ అన్నారు. శనివారం స్థానిక అతిధి ఇన్ హోటలో జిల్లా వ్యవసాయ ఉత్పత్తులపై డీలర్లకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యూరియా వాడకం అధికంగా పెరిగిందన్నారు. దీనివల్ల యూరియాపై కేంద్ర ప్రభుత్వం బారీగా సబ్సిడిని అందజేస్తుందన్నారు. బస్తాలకు ప్రత్యామ్నాయంగా నానో శక్తి యూరియా, డిఎపిలను మార్కెట్‌లోనికి చేసిందన్నారు. కేవలం ఎకరానికి అర లీటర్ నానో యూరియన్ పిచ్చికారీ చేస్తే సరిపోతుందని, దీనివల్ల యూరియా తక్కువ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిజియం డాll సుదానంద్, మేనేజర్ నటరాజ్, అసిస్టెంట్ మేనేజర్లు కె.రవీంద్రనాథ్, జె.కెఎస్వి మోజెస్, హోల్‌సెల్, రిటైల్ డీలర్లు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఈనెల 28వ తేదీ ఆదివారం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ శిబిరంలో 15 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీ శ్రావ్య, డాక్టర్ ఏ శ్రీనాథ్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందిస్తారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సింది కోరారు.

విశ్వకర్మ లబ్ధిదారుల ఎంపికపై సర్వే

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విశ్వకర్మ లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఎంపీడీవో నాగేశ్వరరావు శనివారం నిర్వహించారు. తరతరాలుగా కులవత్తులు చేస్తున్న టైలరింగ్, బార్బర్,, ప్లంబర్స్ అభివద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ స్కీంకు సంబంధించి కౌతరం, గుడ్లవల్లేరు గ్రామాల్లో గల లబ్ధిదారుల వ్యాపార కేంద్రాల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, కవుతరం పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-కంకిపాడు : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. శనివారం తాడిగడప మున్సిపాలిటీ కానూరులో దోమల నివారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల దోమలతో డెంగ్యూ మలేరియా జ్వరాలు పెరుగుతుంటాయని, అందుకే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-పమిడిముక్కల : వీరంకిలాకు ప్రభుత్వ ఆస్పటల్ పక్కన అన్నపురెడ్డి అప్పన్న పోతన రాజ్యలక్ష్మి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి శనివారం ఆహుతయ్యింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటల ఆర్పి వేశారు. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నాదెండ్ల సుబ్రహ్మణ్యం, బోలం లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించారు.

ఫీటల్ టిష్యూ ప్రాసెసింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని నెంబర్ వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ 21వ రీజనల్ సొసైటీ ఆఫ్ అనాటమిస్ట్ మీట్ 2024 వర్క్ షాప్, కాన్ఫరెన్స్ జూలై 26 నుండి 28 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫీటల్ టిష్యూ ప్రాసెసింగ్ అండ్ స్టెయినింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి అనేకమంది అనాటామిస్టులు హాజరయ్యారు. అపోలో చిత్తూరు జిల్లా ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డాక్టర్ సుభద్ర దేవి, ఎన్నారై కళాశాల ప్రొఫెసర్ మరియు పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ వీ రేణుక మరియు అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ యోగేష్ ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. నిమ్స్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్ బాబులాల్, డాక్టర్ పి శ్యాంప్రసాద్, డీన్ డాక్టర్ వి.కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరాం ముఖ్యఅతిథిగా పాల్గొని అభినందనలు తెలిపారు. నిమ్స్ అనాటమి విభాగాధిపతి ప్రొఫెసర్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి అపర్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయానికి తోడ్పడిన చైర్మన్ డాక్టర్ మహమ్మద్ సాకేత్ రసూల్ ఖాన్, వైస్ చైర్మన్ మహమ్మద్ సాదిల్ రసూల్ ఖాన్‌లకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- నందిగామ : సైబర్ క్రైమ్స్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని నందిగామ సీనియర్ కోర్టు సివిల్ జడ్జి వి. లక్ష్మీ రాజ్యం పేర్కొన్నారు. శనివారం నందిగామ మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామ చైతన్య డిగ్రీ కళాశాలలో 'ర్యాగింగ్ - డ్రగ్స్‌'పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మీరాజ్యం జడ్జి మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు, దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు, నందిగామ - ఎస్సై-2 పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్, సీనియర్ న్యాయవాదులు గుర్రాల వెంకటరత్నం, కొమ్మినేని మౌళేశ్వరరావు, షేక్ ఆజాద్ కళాశాల యాజమాన్యం, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం కోసం ఎంపికి వినతి

విజయవాడ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సెంట్రల్ గవర్నమెంట్ గ్రూప్ హెల్త్ స్కీమ్ (సి.జి.హెచ్.యస్) అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం కోసం కొరకు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఆర్గనైజేషన్ (అఫ్లియేటెడ్ టు భారత్ పెన్షనర్స్ సమాజ్, న్యూ ఢిల్లీ) అధ్యక్షులు, నాయకులు శనివారం ఎంపి కేశినేని శివనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత కూడా అడిషనల్ డైరెక్టర్, సి.జి.హెచ్.యస్. కార్యాలయం నేటికీ హైదరాబాద్‌లోనే కొనసాగించడం వల్ల ఆంధ్రప్రదేశ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొనటం, వాటి పరిష్కారం కోసం హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లటం, పలు ఇబ్బందులకు గురికావటమే కాక, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను ఎక్కువ శాతం హైదరాబాద్ (తెలంగాణా రాష్ట్రం)కే ఉపయోగించు కుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తగినన్ని నిధులను మంజూరు చేయకపోవడం తదితర విషయాలను ఎంపికి వివరించారు. అనంతరం ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, అడిషనల్ డైరెక్టర్, సి.జి.హెచ్.ఎస్. కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నిస్తానని ఎంపి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సెంట్రల్ అండ్ స్టేట్ పెన్షనర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె.వెంకటప్పయ్య, సెక్రటరీ టి.వి.కృష్ణారావు, అధ్యక్షులు ఎం.సీతారామయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు వి.యస్.యన్.సి.శర్మ, మోహన్‌రావు, ఎస్.రాఘవాచార్యులు ఉన్నారు.

బడ్జెట్లో మొండిచేయి

కేంద్ర బడ్జెట్ అమరావతి ప్రాంత ప్రజలతో పాటు విజయవాడ నగర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ ప్రాంతాలకు అవసరమైన మౌలిక వనరుల కల్పనకు అవసరమైన నిధులు సమకూర్చడంలో బడ్జెట్‌లో గ్రాంట్ రూపంలో ఒక్క రూపాయి కూడా ప్రకటించకపోగా, 'అప్పులే మీకు శరణ్యం' అన్న పద్ధతిలో ఈ ప్రాంతం పట్ల కేంద్రం వ్యవహరించిన తీరు పట్ల నగర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్ర విభజనతో ఈ పదేళ్ల కాలంలో పూర్వ వైభవాన్ని కోల్పోయిన విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి మొన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏ విధమైన కేటాయింపులు లేకపోవడంతో నగరంతో పాటు చుట్టుపక్కల చేపట్టాల్సిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కానీ, ఈ నగరంలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ, మంచినీటి సదుపాయం ప్రాజెక్టులు, యుజిడి, డ్రైనేజీ వ్యవస్థ తదితర పలు అభివృద్ధి పనులకు మోక్షం ఎప్పుడో అన్నట్లుగా తయారయింది. పెరుగుతున్న పారిశుధ్య అవసరాల కనుగుణంగా విజయవాడ నగర పాలక సంస్థలోని 64 డివిజన్లలో ఇప్పుడున్న కార్మికులకు తోడు మరో నాలుగు వందల మంది వరకు పారిశుధ్య కార్మికులు అవసరమవుతారని, మూడు వందల మందినైనా భర్తీ చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక వీఎంసి అధికారులు నివేదిక పంపించి ఏళ్లుగడుస్తున్నా...నేటికీ అతీగతీ లేదు. ఔట్‌సోర్సింగ్‌పద్ధతిలో కార్మికులను భర్తీ చేసుకొని, ఆ కార్మికుల వేతనాల ఖర్చుకయ్యే డబ్బును వివిసి జనరల్ ఫండ్ (వివిధ పన్నుల ద్వారా నగర ప్రజల నుంచి వసూలు చేసి) నుంచి ఇచ్చుకోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత సలహా ఇచ్చినట్లు స్వయంగా వివిసిలోని ఉన్నత స్థాయి అధికారుల నుంచే సమాచారం వినిపిస్తుండటం గమనార్హం. పెండింగ్‌లో ఉన్న పెద్ద పెద్ద

వీక్షణం

ప్రాజెక్టులు, శిథిలావస్థకు చేరి ప్రమాదకర స్థాయిలో ఉన్న బ్రిడ్జిల పునర్నిర్మాణం, 15 ఏళ్ల నుంచి మొండి గోడలతో దర్శనమిస్తున్న గుణదల ఫ్లైఓవర్, సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్, ఆర్‌ఆర్‌పేట పరిధిలో ఆర్‌యుబి నిర్మాణంతో పాటు ఔట్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణాలకు నిధులు లేక దశాబ్దాల తరబడి అంచనాలకు, ఎన్నికల హామీలు, వాగ్దానాలకే పరిమితం అవుతూ...పాలకపార్టీలయిన టిడిపి, వైసిపిలు కాలం గడుపుతున్నాయి. చట్టబద్ధంగా ఏర్పాటు చేయాల్సిన మెట్రోలైన్, విజయవాడ రైల్వే స్టేషన్ విస్తరణ, ఆధునీకరణ పనులకు కూడా కేంద్ర బడ్జెట్‌లో కనీసంగా ఊసే లేకుండా పోయింది. విజయవాడ నగరంలోని బందర్ కాలువ, ఏలూరు, రైవస్ కాలువలపై నిర్మించిన 50 బ్రిడ్జీలలో అత్యధిక భాగం శిథిలావస్థకు చేరడమో, పెరుగుతున్న ట్రాఫిక్‌కనుగుణంగా లేక, ఇరుకుగా ఉండి, నిత్యం ఏదో ఒక బ్రిడ్జీ సెంటర్‌లో ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యం అయింది. పదేళ్ల కాలంలో అటు టిడిపి, ఇటు వైసిపిలు అధికారంలోకి వచ్చిన వెంటనే మొండి గోడలకే పరిమితం అయిన గుణదల ఫ్లైఓవర్ కానీ, సింగ్‌నగర్ రెండవ ఫ్లైఓవర్, ఆర్‌ఆర్‌పేట ఆర్‌యుబి తదితర వాటిని ఎమ్మెల్యేలు పరిశీలించడం, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించడం తప్పా... చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని ప్రస్తుతం నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలే విదితం చేస్తున్నాయి. ఈ నగరానికి 2016లో స్కీమ్ మంజూరయ్యి, రూ.461 కోట్ల కేంద్రం నిధులతో 2017లో ప్రారంభించిన స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ స్కీమ్ ఎమిదేళ్ల గడిచినా కేవలం 40 శాతంలోపు మాత్రమే పనులు పూర్తి అయ్యి నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారు కావడమే గాక, మిగిలిన 289 కోట్లు నిధులు ఎటు దారి మళ్లాయో నేటికీ తేలని అంశంగా తయారయింది. ఇటువంటి నేపధ్యంలో కేంద్ర బడ్జెట్ ఈ ప్రాంత ప్రజల అవసరాలకనుగుణంగా లేకపోగా, టిడిపి దాని మిత్రపక్షాల ప్రచారార్భాటం, మాయ మాటలకే పరిమితం అయిందనే చర్చ నగర వాసుల్లో లేకపోలేదు.

- రాజు

కొండ ప్రాంతంలో వీఎంసి కమిషనర్



కొండ ప్రాంత పరిశీలనలో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసి కమిషనర్‌ధ్యానచంద్ర

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా చిట్టినగర్ కొండ ప్రాంతంలో గల రాయప్పరాజు స్ట్రీట్, రామాలయం స్ట్రీట్, టానర్ పేట, గుజ్జారి ఎల్లారావు మార్కెట్ సముదాయం, డాక్టర్ కెఎల్.రావు పార్క్, డాక్టర్ కెఎల్ రావు స్విమ్మింగ్ పూల్ ప్రాంతాలు మొత్తం పర్యటించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముందుగా 48వ డివిజన్లో గల రాయప్ప నగర్ ప్రాంతం మొత్తం పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడ్ కాల్వల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీసేయడమే కాకుండా, డ్రైన్ మ్యాప్‌ల ద్వారా ఏ పూడికలు తీసుకుంటున్నారో ఆ పూడికలను మార్క్ చేసుకొని, సైడ్ డ్రయిన్ల ప్రవాహం మ్యాప్ ద్వారా తెలుసుకుంటూ సైడ్ కాలవల్లోని పూడికల సమస్యలను పరిష్కరించొచ్చని, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం డాక్టర్ కె.ఎల్.రావు పార్క్ సందర్శించి అక్కడ వాకింగ్ ట్రాక్‌ను, పార్క్ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పార్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎఎస్ఎన్ ప్రసాద్‌కు ఆదేశాలిచ్చారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రతో పాటు అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఎ.మహేష్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ -1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -1 ఏ ఎస్ ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబా శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబాబు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ రజియ షబీన, సానిటరీ సూపర్వైజర్ ఓబేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సెక్రటరీలు ఉన్నారు.

సిఐటియు వైజ్ఞానిక తరగతులు



సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.కృష్ణ ఆరోపించారు. తిరువూరులోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండ్రోజుల పాటు జరగనున్న సిఐటియు ఎన్టీఆర్ జిల్లా వైజ్ఞానిక తరగతులను శనివారం సీనియర్ నాయకుడు ఎస్వీ.భద్రం సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. జిల్లా నుండి ఎంపికై వచ్చిన ప్రతినిధులకు పాత్రుడు అధ్యక్షతన మతం, మతోన్మాదం, కార్మికుల కర్తవ్యం అంశంపై పి.అజయ్‌కుమార్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, కార్మికులపై ప్రభావం అంశంపై డి.వి.కృష్ణ వివరించారు. ఈ చర్యలను ప్రతిఘటించ చేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి ఇవి.నారాయణ, వెంకయ్య, మహేష్, సోమేశ్వరరావు, సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు మేకల నాగేంద్ర ప్రసాద్, పంతంగి. శ్రీనివాసరావు, బి.వెం కటేశ్వర రావు, ఆకుల రవి, కె.వి.రత్నం పాల్గొనగా ప్రజా నాట్యమండలి నాయకులు సాంబారు వెంకటేశ్వర్లు, పి.తులసీరాణి, ఎం.నాగమణి, రాణి కార్మిక వర్గ గేయాలను ఆలపించారు.

మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి(వీజీఆర్) ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేయడం అభినందనీయమని విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. మొగల్రాజపురంలోని వీజీఆర్ డయాబెటిస్ హస్పటల్ వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి వెయ్యి మొక్కలను ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నాటేందుకు వీజీఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా డాక్టర్ వేణుగోపాలరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజివైన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, చాలామంది పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా మొక్కలు నాటి వదిలేస్తున్నారని అయితే వాటి సంరక్షణ కూడా ముఖ్యమన్నారు. డాక్టర్ వీజీఆర్ మాట్లాడుతూ, మధుమేహ వ్యాధి రావడానికి పర్యావరణ కాలుష్యం కూడా ఒక కారణం అన్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు 50వేల మొక్కలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కడియం నర్సరీల నుంచి తీసుకువచ్చి పంపిణీ చేసినట్లు చెప్పారు. వాటిలో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు ఉన్నాయని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ సమరం, సెక్రటరి డాక్టర్ ఇళ్ల రవి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ రేష్మ, వీజీఆర్ డయాబెటిస్ హాస్పటల్ తరపున డాక్టర్ తనూజ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ దర్శనాలపై పరిమితులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, దుర్గమ్మ దేవాలయం ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చే వారు ప్రతి రోజు ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రావద్దని ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి కె.ఎస్.రామారావు శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దేవస్థానంలో ప్రతిరోజూ ఉ.11.45 గంటల నుండి మధ్యాహ్నం 12.15 గంటల వరకు మహా నైవేద్యం నిమిత్తం దర్శనం ఆపడం అందరికీ విదితమే. దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెరుగుతున్న యాత్రికుల రద్దీ దృష్ట్యా సూచించిన సమయంలో కాకుండా ఇతర సమయంలో దర్శించుకుని దేవస్థానం వారికి సహకరించాలని కోరారు. శుక్ర, శని, ఆదివారములు, ఇతర ప్రత్యేక రోజుల్లో అధిక రద్దీ దృష్ట్యా ఘాట్ రోడ్ ద్వారా కొండపైకి వాహనాలు నిలుపుదల చేసి పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాలు వద్ద పార్కింగ్ చేసుకొని దేవస్థానం బస్సుల్లో కొండపైకి చేరుకోవాలని కోరారు.

గ్రామం దత్తత



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం లోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక (ఎ) తి ని ది. ఎం.రాంప్రదీప్ ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. దాతల సహకారంతో గ్రామంలోని ఉన్నత పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, నిరు పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారాన్ని అందించడం, వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్‌లో ఉచితంగా గైడెన్స్ ఇవ్వడం, సీజనల్ వ్యాధులు, మూఢన మ్మకాల వల్ల వచ్చే నష్టాలను కరపత్రాల ద్వారా ప్రజల కు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్ట నున్నట్లు ఆయన శనివారం విలేకర్లకు తెలిపారు. గతంలో పనిచేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అర్లపాడులో మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని నిర్వహించి తోటి ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో అంబేద్కర్, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేయడమేకాకుండా, ఉచిత వేసవి శిక్షణ శిబిరాలని కూడా నిర్వహించానని రామ్ ప్రదీప్ వివరించారు.